కథా నిలయం
3506
శ్రీకాకుళం

# కొరడా

తూర్పు కనుమల దక్షిణభాగంలో చిన్నగూడెం. పట్టణాలకు, పట్టణనాగరికతకు, కుట్రలకు, కుతంత్రాలకు, రాజకీయాలకు, రచ్చబండలకూ - చాలా దూరంగా వున్న గూడెం.

మల్లెపువ్వులాంటి మనసులుగల మనుషులున్న గూడెం - అదే రామగూడెం.

రామగూడెం గాంధీకంటె ముందు పుట్టింది. సీతారామరాజు కాలంలో గాంధీపేరు విన్నారా జనం. కాని గాంధీజీ దేశానికి తెచ్చినమార్పు అక్కడికి చేరలేదు. దేశానికి వచ్చిన స్వాతంత్ర్యం అక్కడి జనానికి అందలేదు. అయిదేళ్ళకోసారి యిద్దరు లేక ముగ్గురు బస్తీబాబులు రెండు లేక మూడు పెట్టెలు, చక్కని రంగు కాగితాలు తీసుకొస్తారు. ఆ చక్కని రంగు కాగితాన్ని ఓసారి పెట్టెలోవేస్తే మళ్ళీ తిరిగి రాదు.

"సొరాజ్జం అంటే అదేకామోసు" అనుకునేవాడు కొండదొర సింహాద్రి.

స్వరాజ్యం వచ్చాక ఒకే ఒక కొత్త మార్పు వచ్చింది - ఎక్కడినుంచో వచ్చాడు - ఓ పెద్దదొర - రాయలందొర. కొండకింద భూమిని కొన్నాడట.

కొన్నదానికి కొలతలేదు.

యేటా ఆ భూమి పెరిగిపోతూనే వుంది.

భూమిలోంచి నీళ్ళు పుట్టించాడు - రాయలందొర - చెఱకు పండించాడు. అక్కడి అలగా జనం ఎరుగనివన్నీ పండించాడు - అక్కడి జనంచేత పనిచేయించాడు.

కాని ఆ పంటలు అక్కడి జనంకోసం కాదు.

ఎక్కడో వున్న నాగరికుల కోసం - తనకు కావలసిన డబ్బుకోసం.

ఆ గూడెంజనం అంతా ఆయన దగ్గరే పనిచేస్తారు. కొత్తలో రోజుకి మనిషికి పావలాకూలి. ఇప్పుడిప్పుడే రూపాయి. గుండ్రని బిళ్ళకాదు. ఫెళపెళలాడే రంగుకాగితం.

రూపాయిని చూసి ఆ జనం పొంగిపోతారు. ఒక్క రోజులో ఒక రూపాయిని ఎప్పుడూ యిదివరలో అక్కడి జనం చూడలేదు.

అందుకే అక్కడి జనానికి రాయలందొరంటే భక్తి. తప్పుచేస్తే కొరడాతో కొడతాడు - నోటికొచ్చినట్టు తిడతాడు.

అయినా అక్కడి జనం మాట్లాడరు.

అలాంటి అధికారం ఆయనకుందనుకుంటారు.

ఆయనదగ్గర తుపాకి వుంది - తేడా పాడావస్తే కాల్చేస్తాడు.

అందుకే ఆయనంటే భయం!

ఎవ్వరూ ఎదురు చెప్పరు రాయలం దొరకి. ఆయన చెప్పింది చెయ్యాలి – ఆయన యిచ్చింది పుచ్చుకోవాలి – అడ్డుచెబితే కొరడా దెబ్బలు తినాలి.

అదీ అక్కడి రాజ్యం!

కొండదొర సింహాద్రి పనిచెయ్యక్కర్లేదు. తక్కిన జనంచేత చేయిస్తాడు. అయినా అతని కూలి అతనికి వస్తుంది. కొండదొర సింహాద్రి కొడుకు అప్పన్న. అప్పన్నకి రాయలందొర దివాణంలోనే పని.

పేరుకి దొర – సింహాద్రి.

నిజందొర – రాయలందొరే!

ఆ గూడెంలో ఓ సింగంపిల్ల – దానిపేరు సింగి. "నా" అన్నవాళ్ళు ఎవ్వరూ లేరు సింగికి. కాని గూడెంలోని జనం అంతా సింగి జనమే. అంతా సింగి నోటికి దడిసేవాళ్ళే. సింగిని మంచి చేసుకునేవాళ్ళే. ఎవరికైనా సాయపడుతుంది సింగి.

కొండల్లో కోనల్లో ఆడుకుంటూ పరుగెత్తే సెలయేరు సింగి.

పళ్ళు, దుంపలు తిని బ్రతికేది సింగి. అక్కడి అందరు ఆడాళ్ళలాగే రవికంటే తెలీదు సింగికి.

కళగల ముఖం – నల్లనివళ్ళు – నల్లపాలరాయి లాంటి నునుపు – గట్టిగల వళ్ళు – కవ్వించే చూపులు – ఇవన్నీ అందాలే "కంచుమువ్వ" లాంటి సింగికి.

నవ్వుతూ బ్రతికే సింగి –

నవ్వించే సింగి.

ఆ గూడానికే ఒక సిరి, – సింగి.

కోడెవయసు కుర్రాళ్ళకు కన్నుల పండుగ – సింగి. కొండమీంచి క్రిందికిజారే సెలయేరులో పువ్వువేసి – కూడా పరుగెడుతుంది సింగి. చెట్లెక్కుతుంది. తీగలు పట్టుకు ఉయ్యాలూగుతుంది – ఏ ఆనకట్టలూ లేక పొంగే నది – సింగి. నిత్యం పొంగులో వుండే నది – సింగి.

రాయలందొర నౌకరూ, కొండదొర సింహాద్రి కొడుకూ అయిన అప్పన్న – అడవిలో వెదురుపొదమాటులో మాటేశాడు. చిరుగాలికి రెపరెపలాడే చివురాకులా – సింగి తూలుతూ తుళ్ళుతూ చేరువయింది అప్పన్నకి.

సింగి జబ్బపట్టి, సందిట్లోకి లాక్కున్నాడు అప్పన్న.

విదిలించుకొని దవడ బద్దలయ్యేలా కొట్టింది సింగి –

"యీపాలెప్పుడేనా – నా సాయలకొచ్చిసూడు – సింగంటే యేటో ఎరుకైనాదా, నేదా యింకా?" అంటూ పారిపోయింది సింగి.

అప్పన్న గుండెలు మండిపోయాయి. పట్టుదల పడగ విప్పింది. 'యాడినీ కట్టుకోకుండ ఎట్టా బతుకుద్దో సూత్తా' అని దవడ పాముకొంటూ కొండదిగిపోయాడు.

అప్పన్న రాయలందొర యింటిదగ్గర వుండే నౌకరు. ఇల్లంతా తిరుగుతాడు. యింట్లో పనులన్నీ అప్పన్నే చేస్తాడు. రాజ్యలక్ష్మమ్మకి వంటలో సాయం చేస్తాడు.

రాజ్యలక్ష్మమ్మని చూస్తేనే అప్పన్నకి కడుపునిండి నట్టుంటుంది – దేవతలా చూసుకుంటాడు.

సమయంచూసి రాజ్యలక్ష్మమ్మకి తన బాధ విన్నవించుకున్నాడు అప్పన్న. "సింగి మా గూడెం పిట్టే! మా సెడ్డ ఒల్లు పొగరమ్మగోరు – దానికి. దాన్నికూడ యీడనే పనిలో యెడితే నాకు జోడుగుంట దమ్మగోరు?" అన్నాడు అప్పన్న.

"దానిజోడు నీకెందుకురా?" అంది రాజ్యలక్ష్మి కొంటెగా.

అప్పన్న సిగ్గుపడి తలవంచుకున్నాడు.

రాయలందొర సింగికి కబురంపాడు. "ఆ గుట్లమ్మట! చెట్లమ్మట తిరగడం ఎందుకే? – మనింట్లో వుండి పనీ పాట చూసుకోక" అన్నాడు రాయలందొర.

"అల్లాగే దొర." అంది సింగి.

సింగి అప్పన్న కళ్ళముందు తిరుగుతోంది. పనిలో చేరిననాడే అప్పన్నని పలకరించింది. సింగి. "ఏరా అప్పన్న! బాగున్నావా?" అని.

"నాకేటి నోటు?" అన్నాడు అప్పన్న. తన చెయ్యి అనుకోకుండా దవడమీద కెళ్ళింది. కాని మనసులో ఏదో తృప్తి. సింగంటే మక్కువ – చచ్చే మక్కువ.

చెఱకు కొట్టి, ట్రాక్టర్లమీద, లారీల మీద ఫాక్టరీకి తోలుతున్నారు. వంద ఎకరాలలో చెఱుకు, పొలంపని రద్దీగా వుంది. పొలంలో ఒక షెడ్ వుంది. పని రద్దీగా వున్నపుడు షెడ్‌లో మకాం చేస్తాడు రాయలందొర.

సింగి కేరేజి పట్టుకొచ్చింది. రాయలందొర భోంచేసి చుట్టముట్టించాడు. గుక్కెడు పొగ బయటికి వదిలేడు. మెలికలు తిరిగే పొగలో రాబోయే ఆదాయాన్ని చూసుకుని నవ్వుకున్నాడు. కేరేజిగిన్నె కిందపడిన చప్పుడు – రాయలందొర అటు చూశాడు. సింగిముందుకు వంగి ఎంగిలాకు ఎత్తుతోంది. పమిట వదులైంది. సింగి బిగిసిన చనుకట్టు బయటికి తొంగి చూసింది. ఆ నల్లపాలరాయి నునుపుమీద, బిగువుమీద రాయలందొర కన్నుపడింది.

తన కడ్డేముందనుకున్నాడు రాయలందొర.

"సింగీ" అన్నాడు ఏటోచూస్తూ.

"యేంటిదొర?" అంటూ దగ్గరకొచ్చింది సింగి.

చెయ్యి పట్టుకొని మంచం మీదికి లాగాడు. సందిట్లోకి తీసుకున్నాడు. నల్లరాళ్ళలాంటి చనుకట్టు బిగువును రాయలందొర మెత్తని చేతులు పరీక్షించబోయాయి.

"దొరా!" అని అరచి విదిలించుకుంది సింగి.

"కొత్త" అనుకొన్నాడు రాయలందొర మనసులో. నవ్వుతూ అడుగు ముందుకేశాడు.

"దోసం దొరా! – యీడొచ్చిన గుంట మొగోల్లని తాకనాదంట – మా రత్తాలు పిన్నమ్మ సెప్పింది. అందుకే అప్పన్నని ఒపాలి దవడూడేసినాను. నాకు కోపమొత్తే వల్లుతెల్దుమరి?" అంది సింగి వణికిపోతూ.

"భయపడకే. నాతో వుంటే దోషంలేదే. నీ యీడు వాళ్ళతో వుండకూడదు. నేను మీకందరికీ దొరనికదా" అంటూ నీతి బోధించాడు రాయలందొర.

'మరి నువ్వూ మొగోడివేగాదొరా?' అంది సింగి అమాయకంగా.

"ఆఁ నా మొఖం, ఏదో సరదాకాని......." అంటూ మరో అడుగు ముందుకేశాడు రాయలందొర.

"నాకు మాసెడ్డా గుండదురుతున్నాది దొర" అంటూ మరో అడుగు వెనక్కేసింది సింగి.

"భయపడకే వెర్రిముఖమా! యిదేం తప్పుకాదే ఆకలేస్తే కూడుతినవ్?" అంటూ మంచి మాటలతో సింగిని లొంగదీసుకున్నాడు రాయలందొర.

కాని సింగికి యిదేమీ నచ్చలేదు. ఎవరికీ చెప్పుకోలేదు, కాని, అప్పన్నని చూస్తే మాత్రం జాలేసింది సింగికి.

"అడు నావాడు నా గూడెంవోడు. అడేం పాపంసేసినాడు? యీపాలడిగితే కాదన్ను" అనుకుంది సింగి.

ఓనాడు - అప్పన్న తన మనసులోని మాటను రాయలందొరకి చెప్పుకున్నాడు.

"సింగిని కట్టుకోవాలని మనసేత్తంది దొరా?" అన్నాడు అప్పన్న - అదనుచూసి రాయలందొరతో.

"సరే" అన్నాడు రాయలందొర.

కొండదొర సింహాద్రితో చెప్పి, సింగికి అప్పన్నకి రాయలందొర పెళ్ళి చేయించాడు.

సింగి అప్పన్నని పువ్వులా చూసుకుంటుంది. అప్పన్న సింగిని పెంపుడు లేడికూనలా ముద్దాడతాడు. ఒకళ్ళని చూసి ఒకళ్ళు పొంగిపోతారు - ఒకళ్ళని వదలి ఒకళ్ళు వుండలేరు - చూసుకోకుండా వుండలేరు. ఓనాడు పనిరద్దీగా వుండి అప్పన్న పొలం మీద కెళ్ళాడు. యింటిపని పూర్తయ్యాక, సింగికి అప్పన్నని చూడాలనిపించింది. పొలంలోకి పరుగెత్తింది. షెడ్ దయ్యంలా కనపడింది. షెడ్ పక్కనించే వెళ్ళాలి తను. తలుపు కన్నంలోంచి లోపలికి చూసింది. తన కళ్ళను తనే నమ్మలేకపోయింది - రత్తాలు పిన్నమ్మ రాయలందొరతో మెలేసుకుని మంచంమీద దొల్లుతో వుంది.

'తనకి దోసవనిసెప్పి, రత్తాలు పిన్నమ్మే దోసం సేత్తందేటి?' అనుకుంది. 'ఏమైనా రత్తాలు పిన్నమ్మ నడగాల' అనుకుంది సింగి.

సందచీకటి పడ్డాక గూడెంలో కెళ్ళింది సింగి - రత్తాలు పిన్నిగుడిశలోకి దూరింది.

'రాయే గుంటా' అంది రత్తాలు.

'పిన్నమ్మా! నేనో వూసడగనా?'

'ఏటేటే! అడుగూ'

"నువ్ సెడ్‌లో మద్దేనేల సేసిన పని - దోసంగాదంటే!" అంది అమాయకంగా సింగి.

రత్తాలు ముఖంలో ఎంతో ఉదాసీనత కనపడింది. మాటల్లో నిస్పృహయత నిండిపోయింది, "రాయలందొర పగ-పాంపగే. కాదంటే కాటేత్తడే. కొరడా వున్నదాయనకాడ. పిత్తోలున్నాదాయనకాడ. కాదంటే మల్లీ యేంపితూరో అని ఆయన మాట కద్దుసెప్పరే మనోళ్ళంతా" అంది రత్తాలు.

"మనసింవాద్దిరిదొర అట్టాటిపనెప్పుడేనా సేసాడంటే పిన్నమ్మా?"

"మన దొర పుట్టినకాడనుంచీ దొరేనే. రాయలందొర నడమంతరందొర. మరేంసేత్తాం సెప్పే గుంట." అంది రత్తాలు బాధగా.

ఇంతలో మడంపొగొడుకుంటూ సముద్రం వచ్చింది. 'యాడనుంచో బత్తిబాబు ఒచ్చినాడే. మన గూడెంవోల్లందరికీ మంచి సెపుతాడంటే. రండర్రా యల్దాం సింవాద్దిరి గుడిశకాడకి' అంది సముద్రం.

సింహాద్రి గుడిశ గూడెంమధ్యలో వుంది. అందరూ చేరారక్కడికి.

బస్తీబాబు సన్నగా – పొడుగ్గా వున్నాడు, లావుపాటి కళ్ళద్దాలు పెట్టుకున్నాడు. పదిహేనుమైళ్ళు గుట్లమ్మటా చెట్లమ్మటా నడచి, వాళ్ళందరినీ కలవడానికి వచ్చాడట. అతను వాళ్ళకి చెబుతున్నాడు.

అతను చెప్పే పద్ధతిలో ఒక ప్రత్యేకత – అతని మాటల్లో – హావభావాల్లో – ఆ జనాన్ని చూసి అతను పొందే ఆవేదన – వాళ్ళ బ్రతుకులు బాగుచేయగలనన్న ఆత్మవిశ్వాసం – బాగుచేయాలన్న దృఢనిశ్చయం కంచులా మారుమ్రోగుతున్నాయి – నిప్పులా కణకణలాడుతున్నాయి – ఇలా అన్నాడతను – "పట్నంలో రోజుకి, మనిషికి నాలుగు రూపాయలకూలి. అక్కడ పొలంపని చేసుకునే వాళ్ళపిల్లలకి చదువుకునేందుకు బడులున్నాయి – జబ్బులు చేస్తే ఆసుపత్రులున్నాయి? యిప్పుడు రాయలంగారు పండిస్తున్న పొలం – అంతా ఆయనదికాదు. ఆయన మొదట్లో కొన్నది యిరవై ఎకరాలే. అంటే యిప్పుడు ఆయనసాగు చేస్తున్న దాంట్లో యిరవయ్యోవంతు. మిగిలిందంతా మీ అందరిదీను మీరు ముందుగా పండించుకొని వుంటే మీదే అయ్యేది ఆ పొలం. అంచేత మీరంతా రేపటి నుంచి మనిషికి నాలుగు రూపాయల చొప్పున కూలి యిమ్మని రాయలంగారిని అడగండి"

"నాలుగు దుడ్డులు – రోజుకి నాలుగు దుడ్డులే. ఓలబ్బో – యాడిత్తడేటి" అని జనంలో కలకలం.

"మీ పిల్లలకి పాఠశాలలు, మీకందరికి యితర సదుపాయాలు కావాలని ప్రభుత్వాన్ని కోరండి – కోరడం కాదు అడగండి. ఆజ్ఞాపించండి. మీరు వ్యవసాయం చేసుకునేందుకు పొలం కావాలని ప్రభుత్వాన్ని అడగండి" యింకా ఏదో చెప్పబోయాడతను.

మళ్ళీ జనంలో కలకలం. "ప్రభుత్వం అంటే ఏమిటి? యాడున్నదది? ఎట్టా గుంటదది? ఈ దొర వూసులన్నీ కనికట్టు నాగున్నాయ్".

బస్తీబాబు మాట్లాడటం ఆపుచేశాడు. "వీళ్ళకి ఎలా నచ్చచెప్పాలో" అనుకున్నాడు.

కొండదొర సింహాద్రి వుండబట్టలేక పైకి అనేశాడు "నీమాట మీద మావోల్లకి గురికుదరటంలేదు బత్తిబాబు. యాడ మారాయలందొర పని సూపిత్తన్నాడూ, కూలిత్తన్నాడు – నీరు ఆ దొరది – పొలం ఆ దొరది. మేంవ్ ఎగసాయం సెయ్యాలాన్నా – మాకు నీరేడదీ? – యీ సెట్లు గుట్లు ఎల్లా సాగొతయ్‌దొర? – ఏదోనువ్ సెపుతుంటే మేంవ్ యినుకుంటన్నాంగాని. మడిసికి నాలుగు దుడ్డులు కూలేడిత్తరయ్యా?" అన్నాడు సింహాద్రి దొర.

అందరూ గొర్రెల్లా తలలూపారు.

బస్తీబాబుకి మరీ పట్టుదల పెరిగిపోయింది.

"నాతో మీ మనిషొకడిని పంపండి. నే చెప్పేదంతా నిజమో అబద్ధమో చూపిస్తాను" అన్నాడు.

వాళ్ళగూడెం వాడొకడు ఆ బస్తీబాబుతో పట్టణానికి వెళ్ళాడు.

వెళ్ళిన మనిషి, బస్తీబాబు త్వరలోనే తిరిగి వచ్చారు. జనం చుట్టూ చేరారు.

"బత్తీబాబు సెప్పింది నిజం. అడ - మడిసికి రోజుకి నాలుగు రూపాయలు కూలి. అల్లంతా వరికూడు తింటన్నారు. వొల్లంతా గుడ్డ కట్టుకొంటన్నారు. మిద్దెల్లో వుంటన్నారు. ఆ నోకవే యేరు. అడందరూ దొరలేనేవ్" అన్నాడు మరో లోకానికి వెళ్ళివచ్చిన వాడిలా ఆ మనిషి.

జనంలో ఆశ పేరుకుంటోంది. అసంతృప్తి రగుల్కొంటోంది. ఆ విషయాలే - ఆ మాటలే పదేపదే - అంతా - ఆడా, మొగా, ముసలి - పడుచూ - అంతా - అదేమాట మళ్ళీ మళ్ళీ చెప్పుకుంటున్నారు.

ఓనాడు రాయలందొర జనానికి కూలి యిస్తున్నాడు. రాయలందొర పెరట్లోకి జనం అంతా చేరారు.

"బత్తీలో నోజుకి నాలుగు దుడ్డులిత్తారంట కూలి; మరి యీడ కూడ...."

రాయలందొరకి - ఎవరో వెనకనుంచి కొరడాతో కొట్టినట్టయింది.

"అయితే?" అన్నాడు రాయలందొర రక్తాన్నంతా కళ్ళలోకి తెచ్చుకుని.

"మాక్కూడ ఆ లెక్కనే యిప్పిత్తే -"

'యిప్పిస్తా' అని రాయలందొర లోపలికెళ్ళిపోయాడు.

జనం ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నారు. అందరి ముఖాల్లో ఏదో ఆందోళన -

రాయలందొర తిరిగివచ్చాడు కొద్ది క్షణాల్లో -

"మీరిక వెళ్ళండి" అన్నాడు రాయలందొర చేతులు వెనక్కి కట్టుకొని.

జనం అంతా కొండయ్యని చూశారు - ఒక్కొక్కళ్ళే వెళ్ళిపోతున్నారు. ఒకరి వెనకాల ఒకరు జారుకుంటున్నారు. కొండయ్య గుండెలు ఎండిపోతున్నాయి. కళ్ళు మూతపడటం లేదు - వాళ్ళ వెనకాలే - వాళ్ళందరి వెనకాలే కొండయ్య రెండడుగులేశాడు!

"కొండయ్యా, నువ్వాగు!" గర్జించాడు రాయలందొర.

జనం ఆగలేదు. కొండయ్యకోసం జనం ఆగలేదు. వెళ్ళిపోయారు. ఆగకుండా, కొండయ్యని వదిలేసి, వాళ్ళకోసం వాళ్ళు వెళ్ళిపోయారు. వాళ్ళందరికోసం మాట్లాడిన కొండయ్యని వదిలేసి వాళ్ళు వెళ్ళిపోయారు.

కొండయ్య వణికిపోయాడు. "బత్తీ బాబు యాడ" అనుకున్నాడు - కళ్ళు తిరిగాయి - "అంతా మోసం" అనుకున్నాడు మనసులో.

పిడచ చుట్టుకుపోయిన నాలికని తడిచేసుకున్నాడు. వణికిపోతున్న నరాలని బిగపట్టి తడబడుతూ -

"వద్దునే దొర - నీ నెక్కనే యియ్యి" అన్నాడు కొండయ్య.

"యిస్తారా!" అన్నాడు రాయలందొర. రాయలందొర చేతిలో కొరడా - ఉవ్విళ్ళూరుతూ వీపు వెనకాల వున్న కొరడా - ఛళ్ళుమని పేలింది.

కొండయ్య నడుంచుట్టూ నల్లతాచులా మెలేసుకుంది. కొండయ్య పొట్టమీది మాంసాన్ని రుచి చూసి, కాస్త ముక్కని పీక్కుని కొరడా పట్టు వదిలేసింది.

మర్నాడు కొండయ్య కనపడలేదు.

ఎవరూ అడగలేదు.

అడిగితే - అడిగినవాళ్ళగతీ అంతే అని వాళ్ళకి తెలుసు. కాని అందరూ కలిస్తే? - కలసి ఎదురు తిరిగితే? - ఆ వూహ వాళ్ళకి రాలేదు. ఏమౌతుందో వాళ్ళకి తెలీదు.

జరిగిందంతా కళ్ళారా చూసింది. గుండెల్ని ఎవరో చర్చినట్టు బాధపడింది సింగి.

"మెకం మడుసుల్ని మాయం సేత్తం వున్నాది. కాని మడిసి మడిసిని మాయం సేత్తం అమ్మో!" ఆ మాటెత్తితేనే సింగి అక్కడ నిలబడలేకపోయింది.

బత్తీబాబు చెప్పిన మాటలన్నీ వింది సింగి. మళ్ళీమళ్ళీ తనలో తను లోలోపల అనుకుంది ఆ మాటలు.

"అసలు యీ రాయలందొర యేడోడు?" అనుకుంది. మనసుకి వూపిరి సలపడం లేదు. అందుకే బయటికి; రాయలందొర ఇంట్లోంచి బయటికి దూరంగా పారిపోయింది సింగి. తన కొండల్లోకి కొండలమీది అడవుల్లోకి సెలయేరు దగ్గరికి అంతా తిరిగింది సింగి.

సింగి మళ్ళీ సింగం అయ్యింది - వళ్ళు విరుచుకుంది. గాలి పీల్చుకుంది. ఆడుకుంది. సెలయేరులో పువ్వువేసి మళ్ళీ పువ్వుతో పరుగుపందెం వేసింది. పువ్వుతో సమానంగా పరుగెడుతోంది సింగి.

"సింగీ!..." అన్న పిలుపు కొండల్లో మారుమోగింది - పదేపదే ప్రతిధ్వనించింది.

"ఓవ్...." అని బదులు పలికింది సింగి - పరుగు తీసింది. ఏదో ఆపద వస్తేనే ఆ పిలుపు - గుండె దడదడలాడింది.

రత్తాలు పిన్నమ్మ ఎదురైంది సింగికి - ఒగుర్చుకుంటోంది రత్తాలు!

"ఏటైనాదే?" అంది సింగి.

"మన అప్పన్న - రాజ్యలచ్చునమ్మ కునుకుతీత్తావుంటే మీద అలిపోయినాడంట. ఉడుం పట్టు అట్టేసినాడంట. రాయలందొర అడ్ని తంబానికి కట్టేసి, కొరడాతో సెవడాలు తీసేత్తన్నాడే". అంది రత్తాలు. వగుర్చుకుంటూ, వణికిపోతూ.

సింగి పరుగెత్తింది. గాలికంటె వేగంగా - పెను తుఫానులా. రాయలందొర వాకిట్లో వాలిపోయింది. జనం కళ్ళప్పగించి చూస్తున్నారు. ఎవ్వరూ మాట్లాడటంలేదు.

"దొరా!" సింహంలా గర్జించింది సింగి.

"ఏమిటే గింజుకుంటున్నావు?" అన్నాడు రాయలందొర.

రాయలందొర చేతిలో కొరడా - తరతరాలుగా వస్తోన్న కొరడా...అప్పటిదాకా అప్పన్న కండల్ని నంచుకుంటున్న కొరడా - సింగిమీదికి దూకింది!

సింగి బుగ్గ చిట్లింది. రక్తం కారుతోంది. లావాలాంటి రక్తం. కంట తడి పెట్టి ఎరుగని కొండదొర సింహాద్రి కళ్ళలో నీళ్ళు నింపిన రక్తం. ఎఱ్ఱని రక్తం.

కొరడా మళ్ళీ లేచింది. సింగి కొరడాని యీసారి తన చేతికి మెలేసుకుంది. ఒక గుంజు గుంజింది. రాయలందొర ముందుకి తూలాడు.

సింగి కళ్ళలోంచి నిప్పులు కురుస్తున్నాయి. చెంపనుంచి రక్తం కారుతోంది. పెదవులు వణకుతున్నాయి. "సెడ్‌లో దోసందొరా అంటే దోసంకాదని నన్ను సందిట్లోకి తీసుకోనేదంటరా నువ్వా? "ఆకలేత్తే కూడుతినవంటే?" అన్లేదట్రా నువ్వా? అప్పన్నకీ ఆకనేసింది. కళ్ళముందున్నా కూడు తినబోయినాడు – అది దోసం ఎట్టాగౌద్దిరా? కొండయ్య కూలెక్కువడిగితే అయిపునేకుండ సేసినావ్రా. అసలు నువ్వు యారుకి దొరవురా? ఈ యదవలంతా. ఆడోరోల్లయితే, అల్లాడోల్లని సెడ్‌లో కులికి నువ్ దొరగిరి నెలిగిత్తన్నావ్?........సూత్తా రేంరా సన్నాసుల్లారా? యిప్పంట్రా అప్పన్నని," అని సింగి వళ్ళు తెలియని ఆవేశంలో గర్జించింది.

ఇంతలో "ఫైర్" అన్న అరుపు, బూట్ల చప్పుడు – ఈలలు – "ఢాం ఢాం" అని తుపాకుల పేల్పులు – కేకలు – ఒక్కొక్కళ్ళే నేలకూలిపోతున్నారు.

బత్తీబాబు జనంలోంచి ముందుకు గెంటుకొస్తున్నాడు. "పొండి – పారిపోండి" అని అరుస్తున్నాడు.

ఇంతలో ఓ తుపాకిగుండు యెక్కడనుంచో వచ్చింది.

"అబ్బా!" అంటూ బస్తీబాబు నేలకొరిగాడు.

అతని కళ్ళు యింకా ఆశగా చూస్తున్నాయి.

సింగి కొరడాని గుంజుకొని బస్తీబాబు దగ్గరకొచ్చింది.

కొరడాని కింద పారేసింది. కొరడాను జనం తొక్కేస్తున్నారు.

రాయలందొర వట్టి చేతుల్తో నిలబడ్డాడు.

గుండెల్లో రైళ్ళు పరుగిడుతున్నాయి.

జనం కాళ్ళకింద నలిగిపోతున్న కొరడాని బస్తీబాబు చూశాడు. సింగి జేవురించిన కళ్ళలోకి చూశాడు. తృప్తిగా కన్నుమూశాడు బస్తీబాబు.

పెద్దపటాలం చుట్టుముట్టింది.

కొండయ్య ఆచూకి సంగతి గురించి కాదు.

అప్పన్నని ఎవరు కొట్టారో ఎందుకు కొట్టారో కనుక్కుందుకు కాదు.

సింగి ధైర్యాన్ని మెచ్చుకుందుకు కాదు.

సింగి మాంగల్యాన్ని నిలబెట్టడానికి కాదు.

రాయలంబాబుని శిక్షించడానికి కాదు.

శాంతిభద్రతలు కాపాడటానికి........

రాయలందొరని రక్షించడానికి.........

★ ★ ★